సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

దుర్గమ్మ సారె ఊరేగింపు


అక్కయ్యపాలెంలో దుర్గమ్మ సారె ఊరేగిస్తున్న భక్తులు

సీతంపేట : మెగా బాయ్స్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం మంగళ వీధిలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. రోజూ విశేష పూజలు జరిపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారికి సమర్పించిన చీర, జాకెట్లు, గాజులు, పసుపుకుంకుమ, పువ్వులు, పలు రకాల స్వీట్లు మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల కచేరీ


త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : సెంటర్ ఫర్ సైకాలజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ మ్యూజిక్ థెరపీ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న విద్యార్థులు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం కచేరీ నిర్వహించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న త్యాగరాజ, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి కృతులను మృదు మధురమైన కంఠంతో ఆలపించి అలరించారు.

బ్రహ్మోత్సవాల్లో నక్కవానిపాలెం బాలిక నృత్యం


తిరుమలలో నృత్యం చేస్తున్న ప్రణీత

సీతమ్మధార : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి బహ్మోత్సవాల్లో నగరంలోని నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన కె.ప్రణీత నృత్యం చేశారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ప్రణీత స్నేహాంజలి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంటుంది. కథాకళితోపాటు మోహిని అవతారంలో నృత్యం చేసి అలరించారు. శైలజా మూర్తి నేతృత్వంలో 25 మంది శ్రీవారి మాడవీధుల్లో నృత్యం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు వీరిని అభినందించారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్

మర్రిపాలెం : ఇళ్లల్లో చోరీలకు పాల్పడే నిందితుడిని కంచరపాలెం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గత నెల 30న కంచరపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు దొంగలించారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పలు బృందాలు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద అనుమానితులను మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించారు. తుమ్మడపాలెంకు చెందిన బొద్దూరు ధనుంజయ్, నక్కవానిపాలెంకు చెందిన కోరిబిల్లి వెంకటేష్ దొంగతనం చేశామని అంగీకరించడంతో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

స్కూటీల దొంగకు రిమాండ్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ చాలపాక రాజేశ్ (24) గత నెల 28న దొండపర్తి ప్రాంతంలో ఓ ఇంటి ముందు నిలిపిన స్కూటీని అపహరించాడు. అలాగే తాటిచెట్లపాలెంలో ఓ ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారు ఉంగరాలు, నగదు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఫోర్తుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి రైల్వే న్యూ కాలనీలో నిందితుడిని పట్టుకున్నారు. ద్విచక్ర వాహనం, రెండు బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

హైవే దాటాలంటే దడే..!

- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు
- అసంపూర్తిగా వదిలేసిన కాలిబాట వంతెన
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు


జాతీయ రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దిమ్మలు


కప్పరాడ కూడలిలో పాదచారులు నడిచే మార్గంలో ట్రాఫిక్ సమస్య ఇలా..


నిత్యం ఇలా ప్రమాదకరంగా జాతీయ రహదారి దాటుతున్న పాదచారులు



ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో నిరుపయోగంగా ఔట్‌పోస్టు

కంచరపాలెం : కంచరపాలెం జాతీయ రహదారి జంక్షన్ కప్పరాడ వద్ద హైవే దాటేందుకు నిర్మించతలపెట్టిన కాలిబాట వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) పనులు అసంపూర్తిగా వదిలేయడంతో పాదచారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంత మంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జోన్ – 5 ఇంజినీరింగ్ అధికారులు పనులు మాత్రం పూర్తి చేయడం లేదు. జీవీఎంసీ 47, 48 వార్డుల కొండవాలు ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి నుంచి 54, 55వ వార్డులు కంచరపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్‌రోడ్డుకు రావాలంటే కంచరపాలెం వద్ద జాతీయ రహదారిని దాటేందుకు కాలిబాట వంతెన నిర్మించాలని నిర్ణయించారు. అనంతరం జీవీఎంసీ అధికారులు విశాఖ స్టీల్‌ప్లాంట్ సహాయంతో 2012లో రూ.19 లక్షలతో పనులు ప్రారంభించారు. కంచరపాలెం జాతీయ రహదారి బస్టాప్ సాయిధ్యాన మందిరం వద్ద రోడ్డుకు రెండు వైపులా పిల్లర్లు.. కాంక్రీటు దిమ్మలు వేశారు. రెండు దశల్లో దీని నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. కాంక్రీటు దిమ్మలు, పిల్లర్లతో మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టిన అధికారులు మిగిలిన పనులు చేపట్టలేదు. తొలిదశ పనులు ప్రారంభించి ఏనిమిదేళ్లు పూర్తి కావడంతో అక్కడి దిమ్మలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

రాకపోకలకు అవస్థలు

ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు జనం అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి బస్టాప్ వద్ద పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, కూలి పనులకు వెళ్లే బాటసారుల రద్దీ దృష్ట్యా అక్కడే బ్రిడ్జి నిర్మించాలని అప్పట్లో నిర్ణయించారు. తొలిదశ పనుల్లో రూ.లక్షలు వెచ్చించినా తర్వాత పనులు పూర్తి చేయకపోవడంతో హైవే దాటేందుకు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రయత్నంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న వారు సైతం అనేకమంది ఉన్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా నిలిపివేయడం విమర్శలకు తావిస్తోంది.

ఖాళీగా ఔట్‌పోస్టులు

కొండవాలు ప్రాంతాల నుంచి ప్రజలు (పాదచారులు) నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. కప్పరాడ జాతీయ రహదారి కూడలి నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి వెళ్లే ప్రజలు రోడ్డు దాటాలంటేనే ఆందోళన చెందుతున్నారు. వీరి రాకపోకలకు సహకరించేందుకు వీలుగా ట్రాఫిక్ పోలీసులకు ఔట్ పోస్టు ఏర్పాటు చేసినా సిబ్బంది మాత్రం కనిపించడం లేదు. రింగ్ పోస్టును ఆకతాయిలు, బిచ్చగాళ్లు వాడుకుంటున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించే ట్రాఫిక్ పోలీసుల జాడ కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేలు మారినా ప్రయోజనం శూన్యం

కూటమి ఎమ్మెల్యేలు మారుతూ పరిపాలన సాగిస్తున్నా కొండవాలు ప్రాంతాల ప్రజల రాకపోకలకు మాత్రం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు పదేళ్ల పాలన... మళ్లీ ప్రస్తుతం ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజు గెలిచినా ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు దాటాలంటే భయం



కప్పరాడ కూడలి నుంచి జాతీయ రహదారి దాటితే కంచరపాలెం మెయిన్ రోడ్డు. హైవేపై అవతలి రోడ్డుకు వెళ్లాలంటేనే చాలా భయంగా ఉంటుంది. నిత్యం వాహనాల రద్దీతో రోడ్డు దాటలేకపోతున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటుతున్నాం. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

– ఆనందసాయి, రాంజీ ఎస్టేట్

ఇబ్బందులు పట్టించుకోండి



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో నాయకుల హామీలు నీటిమూటగానే మిగిలిపోయాయి. పరిష్కార మార్గం దొరికిన తర్వాత కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకోవాలి.

– బి.సురేష్‌కుమార్, కప్పరాడ

సబ్సిడీపై టమాటా విక్రయాలు

సీతంపేట : కొండెక్కిన టమాట ధరలను నియంత్రించడానికి మార్కెటింగ్ శాఖ రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయాలు ప్రారంభించింది. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం కిలో రూ.50ల చొప్పున విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.70, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80లు ధర పలుకుతోంది. 2 వేల కిలోల టమాటాలు సబ్సిడీపై విక్రయించినట్టు బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు చూపించిన వారికి కిలో చొప్పున విక్రయించారు. బుధవారం కూడా సబ్సిడీపై టమాటా విక్రయిస్తామని ఈవో తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట : ఎస్పీబీ స్వరాభిషేకం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. పల్లా బాబ్జి, రంజిత, వెంకట్, స్వరూప, విశ్వప్రసాద్, కోమలి, శివనారాయణ, హర్షప్రియ, ఎల్.వెంకటేష్, స్వరూప, బొమ్మిడి సత్యనారాయణ, మాధురి పాటలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, కొణతాల రాజు, ఎంవీ రాజశేఖర్, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, వెంకటేష్, లక్ష్మీ స్వరూప పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

కంచరపాలెం : బీసీ సంఘాలు, కార్మికులు, కార్యకర్తలతో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 9న విజయవాడలో నిర్వహించే కుల గణన మహాధర్నా విజయవంతం చేయాలని విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెద్దాడ కనకమహాలక్ష్మి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన నిర్వహించకపోవడం వల్లే పేద ప్రజలు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వాల మొండి వైఖరికి వ్యతిరేకంగా నిరశన తెలియజేయడానికి సిద్ధంగా ఉండాలని ఆమె కోరారు.

జగాలనేలే జగన్మాత

నేత్రపర్వంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


దుర్గాదేవికి చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీలలితాపీఠంలో సుబ్రహ్మణ్య స్వామి సర్వసూక్త హోమం నిర్వహిస్తున్న పండితులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు మంగళవారం శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ ఇక్కడ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 12న దసరా వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని అలయ కమిటీ పెద్దలు, రేసపువానిపాలెం గ్రామ సేవాసంఘం నాయకులు తెలిపారు.

సీతంపేట : దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో సుబ్రహ్మణ్యస్వామి సర్వసూక్త హోమం, ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా అమ్మవారిని బంగారు ఆభరణాలు, పట్టు చీర, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. సప్తమి, మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం సరస్వతి పూజ, సరస్వతి హోమం, రాజశ్యామల హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- స్థానిక సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి మంగళవారం రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు సరస్వతి పూజ నిర్వహిస్తామని, సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ తెలిపారు.

దుర్గాదేవికి డీఆర్‌ఎం తొలిపూజ


పూజలు చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

రైల్వే స్టేషన్ వద్ద బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తొలి పూజ చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత పాల్గొనాలి

మురళీనగర్: యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని బీజేపీ నాయకులు శ్యామల దీపిక, సునీల్ అగర్వాల్ సూచించారు. మురళీనగర్‌లో మహంకాళి ప్రసన్నదేవి యువజన సంఘం నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించడం ద్వారా ప్రశాంతత, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వారితోపాటు కంచరపాలెం పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొని పూజలు చేశారు. సనపల వరప్రసాద్, బొందల మదన్‌మోహన్ రాజు, బగాతి సుధాకర్, రామచంద్రరావు, పద్మజ, లోహితరావు, చక్రి, వెంకటరావు, దిలీప్‌రాజు పాల్గొన్నారు.

రామాలయంలో చండీ హోమం

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలోని లలితాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భోగాపురపు ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం చండికాదేవిగా అలంకరించారు. అనంతరం అర్చకులు భానుమూర్తి, గోపి ఆధ్వర్యంలో చండికా హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తితో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్, జీవీ ఆనందరావు, పి.రామరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


శ్రీమహాలక్ష్మి అలంకారంలో భూలోకమాత అమ్మవారు

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్నగార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనక మహాలక్ష్మి, గాయత్రిదేవి, కనక దుర్గా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ – 2లో హరిహర క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో కొలువైన పార్వతిదేవి మంగళవారం శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు శ్రీలలితా సహస్రనామ పారాయణ చేసి అమ్మవారిని పూజించారు.


చండికాదేవిగా లలితాంబికాదేవి దర్శనం

- జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ మంగళవారం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణను వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర అయ్యప్ప, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం మహాకాళీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు.


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో బండారు ప్రసాద్

'పోర్టు ఆస్పత్రిని ప్రైవేటుకు ఇవ్వడం దుర్మార్గం'

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం పోర్టు అథారిటీకి చెందిన ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తూ కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల కష్టంతో పోర్టు యాజమాన్యం వేల కోట్ల రూపాయలు సంపాదించిందన్నారు. ప్రస్తుతం కార్మికుల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి ఆస్పత్రిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదని, ఆ ప్రతిపాదనను విరమించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఏడాది పోర్టు రూ.786 కోట్లు లాభాలు సాధించగా, 171.42 కోట్లు పన్నులు కట్టిందని తెలిపారు. ప్రస్తుతం పోర్టు దగ్గర వంద సంవత్సరాలకు సరిపోయే రిజర్వు ఫండ్స్ ఉన్నాయని, అయినా ప్రైవేటు వాళ్లకి ఆస్పత్రిని ఇవ్వాలనే బీజేపీ నిర్ణయం దుర్మార్గమని ఆరోపించారు. ఈ దీక్షల్లో సిటు నాయకులు నాయుడు, శంకర్రావు, గణేష్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాంపుల ప్రదర్శన

సీతంపేట : నేషనల్ ఫిలాటలీ డే సందర్భంగా హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో మంగళవారం స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ సందర్భాల్లో ప్రత్యేకంగా ముద్రించిన, అరుదైన స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రదర్శన తిలకించి స్టాంపుల వివరాలు, ప్రత్యేకత తెలుసుకున్నారు. అక్కినేని శత జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన స్టాంపు, పారిస్ ఒలింపిక్స్, అయోధ్య శ్రీరామ జన్మభూమి టెంపుల్, అగ్రికల్చరల్ గూడ్స్, ఇండియా – ఒమన్ దేశాల మైత్రి, ఇండియా – ఈజిప్ట్ 75 ఏళ్ల మైత్రి సందర్భంగా పోస్టల్ శాఖ విడుదల చేసిన స్టాంప్స్ ఆకట్టుకున్నాయి. ఇక్కడ ప్రదర్శించిన స్టాంపులు వాడుకకు దొరకవని, కేవలం సేకరణకర్తలకు ప్రత్యేక ముద్రిత స్టాంపులు అందజేస్తామని పోస్టల్ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. ఏ స్టాంపు ఎప్పుడు విడుదల చేశారు వంటి విషయాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని తెలిపారు.


స్టాంపులను తిలకిస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి వైభవుని సన్నిధిలో దసరా ఉత్సవాలు


వైభవుని ఆలయంలో పద్మావతి అమ్మవారు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. గురువారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించే త్రిరాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం పద్మావతి అమ్మవారిని విశేషంగా అలంకరించి కలశ స్థాపన, సహస్ర నామ కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. రెండో రోజు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మహార్నవమి సందర్భంగా సరస్వతి ఆరాధన, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, విజయ దశమి సందర్భంగా శనివారం సాయంత్రం 6.30 గంటలకు వైభవ వేంకటేశ్వరస్వామిని సర్వాంగ వజ్ర కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పద్మావతి అమ్మవారిని విశేషంగా అలంకరిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. బండారు గుప్తాజీ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.


గాంధీనగర్‌లో దుర్గాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం : మర్రిపాలెం రైల్వేస్టేషన్ 2వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మర్రిపాలెం రైల్వేస్టేషన్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుని కుడి చేతిపై రవి అనే పచ్చబొట్టు ఉందని, ఇతర ఆధారాలు లేవని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులను స్వయంగా గానీ లేదా 9494887786 / 0891 2882910లో సంప్రదించాలని తెలిపారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

ఎమ్మెల్యేకు మిజోరం గవర్నర్ పరామర్శ

సీతమ్మధార : ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు కాలికి గాయం కావడంతో వైద్యులు కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు దంపతులు మంగళవారం సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సీత సుజాత, కుమారుడు పృథ్వీరాజు, కుమార్తె శ్యామల దీపిక, అల్లుడు సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.


మిజోరం గవర్నర్ హరిబాబుతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబ సభ్యులు